సాక్షి మెదక్

శనివారం । 27 । మే । 2023



శుభకార్యానికి వెళ్లి వస్తుండగా..

ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా, నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. 10లో



వెల్డింగ్ చేస్తుండగా...

ఇంకా ప్రారంభం కాని ఓ రైసుమిల్లులో అగ్ని ప్రమాదం జరిగింది. ఓ వైపు ధాన్యం నిల్వలు వేస్తుండగా, మరో వైపు గోదాం నిర్మాణం కోసం వెల్డింగ్ పనులు నడుస్తున్నాయి. 10లో



నిలిచిన ధాన్యం నిల్వలు

లారీల కొరతతో ధాన్యం రాశులు కొనుగోలు కేంద్రంలోనే నిలిచిపోయాయి. ధాన్యం విక్రయిం చేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. 11లో

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ



మాట్లాడుతున్న బాగయ్య

పెద్దశంకరంపేట(మెదక్): ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాగయ్య ఆరోపించారు. శుక్రవారం మండల పరిధిలోని బూర్గుపల్లి కొనుగోలు కేంద్రంలో 40 కిలోల బస్తాకు 43 కిలోలు తూకం వేస్తున్నారని తెలిపారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఐకేపీ సిబ్బంది మిల్లర్లతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు.

రైస్ మిల్లులను తనిఖీ చేయాలి

మెదక్ కలెక్టరేట్: రైస్‌మిల్లర్లు దొడ్డు బియ్యం రీసైక్లింగ్ చేసి సన్నబియ్యంగా మారుస్తూ అందినకాడికి దండుకుంటున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కౌడిపల్లి మండలంలో ప్లాస్టిక్ బియ్యం పంపిణీ చేస్తుంటే ఎక్సైజ్ అధికారులు మొద్దు నిద్రపోతున్నారని మండిపడ్డారు. జిల్లాలో దొడ్డు బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. సన్న బియ్యం అంటూ వివిధ హాస్టళ్లకు తరలిస్తున్నా తనిఖీ చేయడం లేదన్నారు. అధికారులు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై ప్రజలు, విద్యార్థులకు పౌష్టికాహారం అందకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రైస్ మిల్లులను తనిఖీ చేసి అక్రమ బియ్యం తరలిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వీక్లీ పరేడ్‌తో ఫిజికల్ ఫిట్‌నెస్



పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

మెదక్ మున్సిపాలిటీ: వీక్లీ పరేడ్‌తో సిబ్బంది ఫిజికల్ ఫిట్‌నెస్‌గా ఉంటారని మెదక్ డీఎస్పీ సైదులు తెలిపారు. నూతన పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లాలోని సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్, హోంగార్డ్ సిబ్బందికి ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ సైదులు మాట్లాడుతూ.. సమయం దొరికినప్పుడల్లా వ్యాయామం చేయాలని సూచించారు. పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంబించాలన్నారు. క్రమశిక్షణతో డ్యూటీలను నిర్వర్తించాలని.. రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమ నాయకులకే పదవులు ఇవ్వాలి



మాట్లాడుతున్న సర్పంచ్‌లు, గిరిజన నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): రామాయంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్టీకి రిజర్వుడు అయిందని.. ఉద్యమ సమయం నుంచి పార్టీ కోసం పనిచేసిన గిరిజన నాయకుల్లో ఒకరిని ఎంపిక చేయాలని గిరిజన నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని గవ్వలపల్లి తండా, కామారం తండా, జంగరాయి తండా, కొర్విపల్లి తండాలకు చెందిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన తండాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో ఎమ్మెల్యే విఫలమయ్యారని పేర్కొన్నారు. మండలంలో నిర్వహించే పార్టీ కార్యక్రమాల గురించి కనీసం తమతో చర్చించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'తిగుల్‌ను మండలం చేయాలి'

జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌ను మండలం చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 300 రోజులకు చేరుతాయని సర్పంచ్, మండల సాధన సమితి సభ్యుడు భానుప్రకాశ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ఏర్పాటుకు కొండపోచమ్మ వరకు పాదయాత్ర, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు పోస్టుకార్డులు పంపించామని తెలిపారు.

ఖజానా కార్యాలయం ఏదీ?

- మూడేళ్లుగా ముందుకు సాగని వైనం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు, సర్పంచ్‌లు



అల్లాదుర్గంలో వృథాగా ఉన్న భవనం

అల్లాదుర్గం(మెదక్): ఖజానా కార్యాలయం లేక ఉద్యోగులు, సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం అల్లాదుర్గంలో ఎస్టీఓ కార్యాలయం మంజూరు చేస్తూ అధికారులు ఆదేశాలు ఇచ్చారు. భవనాలను సైతం జిల్లా కోశాధికారి చూసి వెళ్లారు. అయితే మూడేళ్లు అవుతున్నా ఇప్పటివరకు ముందడుగు పడలేదు.

- ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, సర్పంచ్‌ల బిల్లులు పాస్ కావాలంటే ఎస్టీఓ కార్యాలయం అవసరం.
- ప్రతి నెల ఉద్యోగుల జీతాలు, ఇతర బిల్లులు, సర్పంచ్‌ల బిల్లుల డ్రా కోసం ఉపకోశాధికారి కార్యాలయంలో సమర్పిస్తారు.
- బిల్లులు పాసైతేనే డబ్బులు తీసుకునే అవకాశం ఉంటుంది. అయితే కార్యాలయం అందుబాటులో లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.
- అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేట, టేక్మాల్ మండలాలు మెదక్ ఎస్టీఓ కార్యాలయం పరిధిలో ఉన్నాయి.
- ఏడేళ్ల క్రితం జిల్లాల పునర్విభజనలో అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, పెద్దశంకరంపేట మండలాలు సంగారెడ్డి నుంచి మెదక్‌లో కలిపారు.
- అంతకుముందు ఎస్టీఓ కార్యాలయం జోగిపేట పట్టణంలో ఉండేది. పునర్విభజన తర్వాత మెదక్ పరిధిలోకి వచ్చాయి.
- ఈ మండలాలకు మెదక్ 60 కిలోమీటర్ల దూరం ఉంటుంది. బిల్లులు కోసం వెళ్లడానికి ఒక రోజు పడుతుంది.
- చిన్న తప్పు దొర్లిన మరో రోజు వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు. రేగోడ్ అయితే మెదక్‌కు 70 కిలోమీటర్ల దూరం ఉంటుంది.
- ఈ ప్రాంత ఉద్యోగులు, సర్పంచ్‌లు బిల్లులు చేసుకునేందు పడరాని పాట్లు పడుతున్నారు.
- అల్లాదుర్గం మండలం టేక్మాల్, రేగోడ్, పెద్దశంకరంపేట మండలాలకు 10 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- అయితే అల్లాదుర్గంలో ఎస్టీఓ కార్యాలయం ఏర్పాటైతే నాలుగు మండలాల ఉద్యోగులు, సర్పంచ్‌లకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.
- ఎస్‌బీఐ అధికారులు సైతం ఎస్టీఓ కార్యాలయం ఏర్పాటు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి రెండేళ్లు గడిచింది. అయినా కార్యరూపం దాల్చలేదు.
- అల్లాదుర్గంలో పాత పోలీస్‌స్టేషన్ భవనం వృథాగా ఉందని.. ఎస్టీఓ కార్యాలయానికి అనువుగా ఉంటుందని పలువురు చెబుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



ఎస్టీఓ కార్యాలయం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. కేవలం బిల్లుల కోసం ఉపాధ్యాయులు ఒక రోజు పాఠశాలను వదులుకుని వెళ్లాల్సి వస్తుంది. ఏవైనా పొరపాట్లు బిల్లులో ఉంటే మరో రోజు వెళ్లాల్సి వస్తుంది. అల్లాదుర్గంలో కార్యాలయం ఏర్పాటు చేస్తే నాలుగు మండలాలకు దగ్గర అవుతుంది. – జనార్దన్, పీఆర్‌టీయూ నేత, అల్లాదుర్గం

భవనం చూసి వెళ్లారు



అల్లాదుర్గంలో ఎస్టీఓ భవనం మంజూరైనట్లు అధికారులు గతంలో చెప్పారు. మూడేళ్ల క్రితమే భవనం చూసి వెళ్లారు. బిల్లులు మంజూరు చేసుకోవడానికి మెదక్ వెళ్లాలంటే విలువైన సమయం వృథా అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయం ఏర్పాటు చేయాలి. – బేతయ్య, సర్పంచ్ కాయిదంపల్లి

అధికారులను కలుస్తాం



ఎస్టీఓ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు ముందుకు వస్తే స్థానిక నేతలతో మాట్లాడి భవనం ఏర్పాటుకు కృషి చేస్తాం. ఈ విషయమై త్వరలో అధికారులను సైతం కలిసి వివరిస్తాం. – శంకర్, ఎంపీడీఓ అల్లాదుర్గం

పాలిసెట్‌లో సత్తా చాటారు

స్టేట్ 3వ ర్యాంకు సాధించిన విద్యార్థి



ప్రియాన్స్ కుమార్‌కు కేక్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

మెదక్‌జోన్: పాలిసెట్‌లో జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో కౌడిపల్లి మండల కేంద్రానికి చెందిన గౌడిచర్ల ప్రియాన్స్ కుమార్ స్టేట్ 3వ ర్యాంకు సాధించాడు. హవేళిఘనపూర్ మండల కేంద్రంలో గల ఎంజేపీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన ప్రియాన్స్ కుమార్ 120 మార్కులకు గానూ 118 మార్కులు సాధించాడు. ఇంజనీరింగ్ చదివి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడాలని ఉందని ఈసందర్భంగా చెప్పాడు. విద్యార్థి తల్లిదండ్రులు నరేందర్, మంజులకు ప్రియాన్స్ కుమార్ మొదటి సంతానం కాగా తండ్రి ఎలక్ట్రీషియన్, తల్లి టైలరింగ్ చేస్తు చదివించారు. ఇదే పాఠశాలలో చదివిన గాజిరెడ్డిపల్లికి చెందిన గోండ్లె సంజయ్ ఠాగూర్‌కు 892వ స్టేట్ ర్యాంక్ సాధించాడు. ఠాగూర్ తల్లిదండ్రులు నాగరాజు, స్వరూప వ్యవసాయం చేస్తూ చదివిస్తున్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయండి

కలెక్టర్ రాజర్షిషా



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మరింత వేగవంతం చేసి జూన్ 2వ తేదీ నాటికి పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మిల్లుల వద్ద హమాలీలను అధిక సంఖ్యలో పెట్టుకొని ధాన్యం అన్‌లోడింగ్ త్వరితగతిన అయ్యేలా చూడాలన్నారు. ఎక్కడైనా మిల్లర్లు ధాన్యం దించుకోవడంలో అలసత్వం వహిస్తే నోటీసులు జారీ చేయాలన్నారు. గత సీజన్‌తో పోలిస్తే ధాన్యం సేకరణ అధికంగా ఉన్నా అక్కడక్కడా రైతులు ధర్నాకు దిగుతున్నట్టు వార్తలు వస్తున్నాయని తెలిపారు. అలాంటి కేంద్రాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రతి మిల్లు వద్ద పోలీసులను పెట్టి త్వరగా అన్‌లోడింగ్ జరిగేలా అధికారులు మానిటరింగ్ చేయాలన్నారు. రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వస్తున్నట్టు కొన్ని నిరాధార వార్తలు వస్తున్నాయని, వాటిని నమ్మవద్దని పేర్కొన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రమేశ్, డీఎస్ఓ శ్రీనివాస్, డీఆర్డీఓ, డీసీఓ, ఆర్డీఓలు, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

రోడ్డెక్కిన రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): రైస్‌మిల్లు వద్ద సీరియల్ ప్రకారం ధాన్యం బస్తాల లారీలు, ట్రాక్టర్లు ఖాళీ కావడం లేదని నిరసిస్తూ శుక్రవారం తూప్రాన్–నర్సాపూర్ హైవేపై రైతులు ధర్నాకు దిగారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ గ్రామాల కొనుగోలు కేంద్రాల నుంచి శివ్వంపేటలోని బైలర్ రైస్‌మిల్లుకు వచ్చిన లారీలు, ట్రాక్టర్లను సీరియల్ ప్రకారం ఖాళీ చేయడం లేదని ఆరోపించారు. రైస్‌మిల్లు వద్ద వీఆర్‌ఏలు డబ్బులు తీసుకుంటూ వెనక వచ్చిన ధాన్యం వాహనాలను పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్ ఆందోళనకారులతో మాట్లాడారు. సీరియల్ ప్రకారం ధాన్యం ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతుల ఆందోళన విరమించారు.

'వరి నార్లు పోసుకోవాలి'

మర్కూక్(గజ్వేల్): రైతులు ముందస్తుగా వరి నారు మడులను వేసుకోవాలని ఏడీఏ అనిల్ అన్నారు. వానాకాలంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనులపై శుక్రవారం మండలంలోని రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. రోహిణి కార్తెలో వరి నార్లు పోసుకోవాలన్నారు. పంటకు ముందు జీలుగు, జనుము, పచ్చిరొట్ట సాగు చేసుకుంటే దిగుబడి పెరుగుతుందన్నారు. 60 శాతం రాయితీపై వీటిని అందిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగేందర్‌రెడ్డి, ఏఈఓ రజనీకాంత్, విష్ణువర్దన్, అశ్విని, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న గోవిందు నరేశ్ మాదిగ

తూప్రాన్: పార్లమెంట్‌లో తక్షణమే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో చెట్లపల్లి యాదగిరి మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలన్నీ ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఉపయోగించుకొని మాదిగల ఓట్లు దండుకోవాలని చూస్తున్నాయని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చేంత వరకు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడి, తీరా అధికారంలోకి రాగానే విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జూన్ 3వ తేదీ నుంచి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభల్లో ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

యువత సన్మార్గంలో నడవాలి

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, (ఇన్‌సెట్) గెలిచిన జట్టుతో కలిసి విజయ సంకేతం చూపుతున్న ఎమ్మెల్యే, తదితరులు

రామాయంపేట(మెదక్): యువత సన్మార్గంలో నడవాలని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సూచించారు. రామాయంపేట ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) క్రికెట్ పోటీలో విజేతలకు శుక్రవారం రాత్రి మెమొంటోలు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరురోజుల పాటు ప్రశాంత వాతావరణంలో పోటీలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు. ఓడిన వారు గెలిచిన వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కళాశాల మైదానంలో పూర్తిస్థాయిలో లైటింగ్ వసతి ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, ఎస్‌ఐ రంజిత్, కౌన్సిలర్ గజవాడ నాగరాజు, సర్పంచ్‌లు సురేశ్, సుభాశ్, రామస్వామి, ఆర్‌పీఎల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని దండుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. లారీల సమస్య ఉత్పన్నం రాకుండా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. రైతులు అధైర్యపడొద్దని.. ప్రతీ గింజనూ కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు మహిపాల్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు శ్రీహరిగౌడ్, ధర్మేంధర్, పీఏసీఎస్ డైరక్టర్ జావీద్ పాషా, నాయకులు రాహుల్‌రెడ్డి, నాయకులు, తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు

న్యాల్‌కల్(జహీరాబాద్): నకిలీ విత్తనాల సరఫరాను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని టాస్క్‌ఫోర్స్ బృందం ఏడీఏ పుష్పరాణి అన్నారు. మండల పరిధిలోని రాష్ట్ర సరిహద్దు వద్ద హుస్సెళ్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద కర్నాటక నుంచి రాష్ట్రంలోకి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం మండలంలోని పలు ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాలను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏడీఏ పుష్పరాణీ మాట్లాడుతూ రాష్ట్రంలోకి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని, ఇతర ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలు తీసుక వచ్చే వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విక్రయ దుకాణాల్లో కూడా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని దుకాణాదారులకు సూచించారు.

సొంతగూటికి శశిధర్‌రెడ్డి

రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



శశిధర్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

మెదక్‌జోన్: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి బీజేపీ నుంచి కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. విద్యార్థి దశలోనే ఓయూ ఆర్ట్స్ కాలేజీ అధ్యక్షుడిగా పనిచేసిన శశిధర్‌రెడ్డి ఎంఏ, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. ఆయన తండ్రి నారాయణరెడ్డి 1989 నుంచి 1994 వరకు మెదక్ ఎమ్మెల్యేగా పనిచేశారు. తండ్రి నుంచి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన శశిధర్‌రెడ్డి ఉమ్మడి మెదక్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. 2002లో జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2004లో టీఆర్‌ఎస్, కాంగ్రెస్ పొత్తులో భాగంగా మెదక్ టికెట్ శశిధర్‌రెడ్డికి కాకుండా ప్రభాకర్‌రెడ్డికి కేటాయించారు. టీడీపీ బీఫాంపై కరణం ఉమాదేవి పోటీ చేశారు. జనతా పార్టీ టికెట్‌పై పోటీ చేసి శశిధర్‌రెడ్డి గెలుపొందారు. అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. 2009లో పొత్తులో భాగంగా టీఆర్‌ఎస్, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావుపై పోటీ చేసి ఓటమి చవిచూశారు. 2014లో శశిధర్‌రెడ్డికి పార్టీ బీఫాం లభించలేదు. కాంగ్రెస్ తరఫున విజయశాంతికి ఇచ్చారు. అప్పట్లో ఆయన విజయశాంతికి మద్దతు ఇవ్వలేదనే ప్రచారం జరిగింది. అనంతరం 2018లో మెదక్ కాంగ్రెస్ టికెట్‌ను శశిధర్‌రెడ్డికి కాకుండా రాజకీయ అనుభవం లేని తన తమ్ముడైన ఉపేందర్‌రెడ్డికి కేటాయించారు. శశిధర్‌రెడ్డికి టికెట్ రాకపోవడానికి విజయశాంతి కారణమని అప్పట్లో సొంత పార్టీ నేతలే బహిరంగంగా మాట్లాడారు. దీంతో ఆయన కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేశారు. అతికొద్ది రోజులు మాత్రమే బీజేపీలో పనిచేసిన ఆయన అందులోనూ ఇమడలేక స్తబ్ధుగా ఉండిపోయారు. అనంతరం తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుకునే ప్రయత్నం చేయగా కొందరు శశిధర్‌రెడ్డి చేరికను అడ్డుకున్నట్టు తెలిసింది. చివరకు ఆయన కాంగ్రెస్‌లో గూటికే చేరుకున్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేశారు. ఈసందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. అందరిని కలుపుకుని వెళ్లి మెదక్ ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్

మెదక్ మున్సిపాలిటీ: హల్దీవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టణ పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ పోలీసులు తదుపరి చర్యల కోసం శుక్రవారం మెదక్ తహసీల్దార్‌కు అప్పగించారు.

వివాహిత అదృశ్యం

కంది(సంగారెడ్డి): ఓ వివాహిత అదృశ్యమైంది. కంది రూరల్ ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం..మండల పరిధిలోని కవలంపేటకు చెందిన కోంగ్ర రాజుతో టంగుటూరు గ్రామానికి చెందిన సుమలతతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి వీరు కవలంపేటలో నివాసం ఉంటున్నారు. ఈనెల15వ తేదీన ఉదయం తన సర్టిఫికెట్లతోపాటు రూ.6వేలు తీసుకొని సుమలత ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేసున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 మందికి ఒక్కొక్కరికీ రూ.2వేల చొప్పున, ఒక వ్యక్తికి రూ.3వేలు, మరో వ్యక్తికి రూ.2వేలు, రెండు రోజుల జైలుశిక్ష విధించినట్టు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సంగారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రంలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. టౌన్ సీఐ శ్రీధర్‌రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట గల బస్టాప్ వద్ద శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 08455–276333, 8712656718 ఫోన్‌నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

కేసుకు భయపడి ఆత్మహత్య


పరశురాములు మృతదేహం

రామాయంపేట(మెదక్): ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రంజిత్ కథనం ప్రకారం... కామారెడ్డి జిల్లా దోమకొండ గ్రామానికి చెందిన లోలపు పరుశరాములు(38) అత్త విజయ ఇటీవల ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ నేపథ్యంలో పరుశరాములుపై కేసు నమోదైంది. దీంతో భయాందోళనకు లోనైన పరుశరాములు రామాయంపేట మండలం దామరచెరువు గ్రామశివారులో శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య రమ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యానికి వెళ్లి వస్తుండగా...

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు
- ఇద్దరు మృతి... మృతుల్లో చిన్నారి
- నలుగురికి గాయాలు, ముగ్గురి పరిస్థితి విషమం


నాగరాజ్(ఫైల్)


హర్షిత(ఫైల్)


పూర్తిగా దెబ్బతిన్న కారు ముందు భాగం

కొల్చారం(నర్సాపూర్): ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా, నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. కొల్చారం ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..పాపన్నపేట మండలం ఎల్లాపూర్ గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు హత్నూర మండలం దౌల్తాబాద్‌లో శుభకార్యం ఉండగా, శుక్రవారం ఉదయం కారులో బయలుదేరారు. శుభకార్యం ముగిశాక అదే కారులో తిరుగు పయనమయ్యారు. అయితే వీరు ప్రయాణిస్తున్న కారు మెదక్– నర్సాపూర్ ప్రధాన రహదారిపై కొల్చారంలోని జైన్ మందిర్ సమీపంలోకి రాగానే మెదక్ నుంచి జేబీఎస్‌కు వెళుతున్న మెదక్ డిపోనకు చెందిన ఆర్డినరీ బస్సును ముందు నుంచి ఢీ కిట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నది. కారు నడుపుతున్న టేక్మాల్ నాగరాజుగౌడ్ (30) ఘటన స్థలంలోనే అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే కారు ప్రయాణిస్తున్న టేక్మాల్ దుర్గా గౌడ్ –లావణ్య దంపతుల కూతురు టేక్మాల్ హర్షిత (2)కు తీవ్ర గాయాలై రక్తస్రావం జరిగింది. కొన ఊపిరితో ఉన్న చిన్నారితో పాటు గాయపడిన వారిని 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందింది. దంపతులు దుర్గాగౌడ్, లావణ్యలతోపాటు రామమ్మ, చంటికి గాయాలయ్యాయి. వీరిలో దుర్గాగౌడ్, లావణ్య రామమ్మ పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతదేహాలకు మెదక్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించగా, బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కారు అతివేగంగా నడపడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని, బస్సులో ప్రయాణిస్తున్న ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు.

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆస్పత్రి వద్దకు చేరుకొని రాజు భార్యను ఓదార్చే క్రమంలో కంటతడి పెట్టారు. రూ. 20 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు.

చదువుకు సాయం

వన్ ఛాలెంజ్ ద్వారా రూ. 50 వేలు అందజేసిన సీఐ వేణుగోపాల్‌రెడ్డి


విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు... కాయకష్టం చేసి పెంచి పెద్దచేసిన తల్లి కూడా ఏడాది క్రితమే మరణించింది. ఉండడానికి సరైన నీడ లేకపోయినా..ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా చదువును మాత్రం మధ్యలో ఆపలేదు నల్లగొండ జిల్లా అనుముల మండల పరిధిలోని పాలెం గ్రామానికి చెందిన అక్కాచెల్లి తాడికొండ కావేరి, తాడికొండ పింకి. కావేరి హాలియాలోని త్రివేణి కాలేజీనుంచి ఒకేషనల్ విభాగంలో మంచి మార్కులతో ఇంటర్, పింకి చింతగూడెం జిల్లాపరిషత్ పాఠశాలలో 7వతరగతి పూర్తి చేశారు. ఒక వైపు చదువుకుంటూనే, సెలవుల్లో కూలిపనులకు వెళుతూ వచ్చే ఆదాయం ద్వారా నెట్టుకొస్తున్నారు. కావేరికి పెద్ద చదువులు చదవాలని ఉన్నా, ఆర్థిక పరిస్థితులు అనుకూలించక దిక్కుతోచని స్థితిలో ఉంది. కొంతమంది మిత్రులు వన్‌ఛాలెంజ్ వ్యవస్థాపకుడు, పటాన్‌చెరు సీఐ నూకల వేణుగోపాల్‌రెడ్డి దృష్టికి కావేరి, పింకి విషయం తీసుకెళ్లారు. చెరో 25 వేల రూపాయల చొప్పున యాభైవేల రూపాయలు చెక్కు రూపంలో శుక్రవారం సీఐ వేణుగోపాల్‌రెడ్డి పటాన్‌చెరులో అందజేశారు. ఈ సందర్భంగా కావేరి మాట్లాడుతూ సీఐ అందించిన సాయంతో కష్టపడిన ఉన్నత చదువులు చదువుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వన్ ఛాలెంజ్ అడ్వయిజర్ సాయి కృష్ణ, సభ్యుడు జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోన్ మంజూరైందంటూ...

సిద్దిపేటకమాన్: లోన్ మంజూరైందని ఆశ చూపి ప్రాసెసింగ్ చార్జీల నిమిత్తం ఆన్‌లైన్‌లో డబ్బు పంపించి ఒకరు మోసపోయారు. సిద్దిపేట పోలీస్‌కమిషనర్ ఎన్.శ్వేత తెలిపిన వివరాల ప్రకారం..గజ్వేల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు లోన్ మంజూరైందంటూ గుర్తు తెలియని వ్యక్తి ఓ లింకు పంపించాడు. లోన్ డబ్బులు మంజూరు కావాలంటే ప్రాసెసింగ్ చార్జీల కోసం కొంత మొత్తం చెల్లించాలని నమ్మబలికాడు.ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి పంపిన లింకును ఓపెన్ చేసి తన వివరాలు నమోదు చేశాడు. అనంతరం సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నమోదు చేయడంతో తన ఖాతా నుంచి రూ.80వేలు డెబిట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు సైబర్ మోసం జరిగినట్టు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నంబరు 1930కు ఫిర్యాదు చేశాడు.

తాగిన మైకంలో డీసీఎం కింద పడి...

కొడిపల్లి(నర్సాపూర్): తాగిన మైకంలో డీసీఎం వెనుకాల పరుగెడుతూ టైరు కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...అందోల్ మండల పరిధిలోని రాంసాన్‌పల్లి గ్రామానికి చెందిన సాదుల శ్రీకాంత్(22) అమ్మానాన్న చనిపోవడంతో బాబాయి శ్రీనివాస్ వద్ద ఉంటున్నాడు. గురువారం గ్రామస్తులతో కలిసి ఓ శుభకార్యానికి డీసీఎంలో వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, మద్యం మత్తులో డీసీఎంలో అల్లరి చేస్తూ, కిందకు దూకుతానని తోటివారిని ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో ఆందోళన చెందిన వారు కాసేపు డీసీఎంను కొడిపల్లి మండలం మనంతాయిపల్లి తండా వద్ద డీసీఎం నిలిపారు. ఈ సమయంలో కొందరు కిందకుదిగారు. కొద్ది సమయం తర్వాత డీసీఎం స్టార్ట్ చేయగా, శ్రీకాంత్ డీసీఎం వెనకాలే పరుగెత్తుకుంటూ వచ్చి టైర్ కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే గ్రామస్తులు విషయాన్ని శ్రీకాంత్ బాబాయ్ శ్రీనివాస్‌కు చెప్పారు. ఆయన సంఘటన స్థలానికి వచ్చే సరికి శ్రీకాంత్ మృతి చెందాడు. ఈ ఘటన మద్యం మత్తులో జరిగిందని శ్రీనివాస్ ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ అదుపు తప్పి...


ఆసరాజు (ఫైల్)

నిజాంపేట(మెదక్): ట్రాక్టర్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా భూంపల్లి మండ లంఖాజీపూర్ గ్రామానికి చెందిన ఆసరాజు(28) చిన్నతనంలోనే తల్లిదండ్రులు కోల్పోయి చిన్నమ్మ భాగ్య వద్ద ఉంటున్నాడు. రాజు గుర్రాలపల్లి గ్రామానికి చెందిన జగన్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామశివారులో ప్రమాదవశాత్తు రాజు నడుపుతున్న ట్రాక్టర్ అదుపు బోల్తా పడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు చిన్నమ్మ భాగ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మామిడి కాయలు తెంపేందుకు వెళ్లి..


ఎర్రోల్ల యాదయ్య (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రమాదవశాత్తు ఒకరు చెట్టుపై నుంచి పడి మృతి చెందాడు.వ్యక్తి మృతి చెందిన సంఘటన మిరుదొడ్డిలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మిరుదొడ్డికి చెందిన ఎర్రోల్ల యాదయ్య(52) కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. యాదయ్యకు ముగ్గురు ఆడపిల్లలు. భార్య యాదవ్వ గతేడాది అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో యాదయ్య రెండో కూతురు కవిత వద్ద ఉంటున్నాడు. శుక్రవారం మామిడి కాయలు తెంపడానికి మిరుదొడ్డిలోని కాసులాబాద్ శివారులోని తోటకు వెళ్లాడు. అక్కడ చెట్టు ఎక్కి మామిడి కాయలు తెంపుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారికింద పడి మృతి చెందాడు.

తెగిపడిన 11 కేవీ విద్యుత్ వైర్

కాలిన విద్యుత్ మీటర్లు


ప్రమాదంలో కాలిపోయిన విద్యుత్ మీటర్

మెదక్ మున్సిపాలిటీ: ఒక్కసారిగా 11 కేవీ విద్యుత్ వైరుతెగి పడి 100 కరెంట్ మీటర్లు దగ్ధమైన ఘటన మెదక్ పట్టణం ఆటోనగర్‌లో గురువారం అర్ధరాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. మీటర్లు, టీవీలు, ఫ్రిజ్‌లు, కాలిపోయాయి. తనకు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగిందని కాలనీకి చెందిన నాగభూషణం రెడ్డి వాపోయాడు. 11కేవీ విద్యుత్ వైర్లలోకి తొండలు వచ్చి చేరినప్పుడు ఇలాంటి ప్రమాదాలు జరుగుతాయని ట్రాన్స్‌కో ఏడీ మోహన్‌బాబు తెలిపారు.కాలనీకి చెందిన 75మంది తమ మీటర్లు కాలిపోయామని ఫిర్యాదు చేశారని, వారికి కొత్తమీటర్లు అందజేస్తామన్నారు.

వెల్డింగ్ చేస్తుండగా...

- ప్రారంభంకాని రైసుమిల్లులో చెలరేగిన మంటలు
- ఆర్పివేసిన అగ్నిమాపక సిబ్బంది


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వెల్దుర్తి(తూప్రాన్): ఇంకా ప్రారంభం కాని ఓ రైసు మిల్లు అగ్నిప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే...మండల పరిధిలోని హస్తాల్పూర్ గ్రామ శివారులో కొత్తగా ఓ రైస్ మిల్లు ఏర్పాటు చేశారు. ఈనెల 31న ప్రారంభం కావాల్సి ఉండగా, పనులు జరుగుతున్నాయి. ఓ వైపు ధాన్యం నిల్వలు వేస్తుండగా, మరోవైపు గోదాం నిర్మాణం కోసం వెల్డింగ్ పనులు నడుస్తున్నాయి. శుక్రవారం వెల్డింగ్ నిప్పులు చెలరేగి ఒక్కసారిగా ధాన్యం బస్తాలపై పడ్డాయి. దీంతో బస్తాలకు నిప్పు అంటుకొని మంటలు లేచాయి. అప్రమత్తమైన సిబ్బంది మంటలు ఆర్పివేశారు. పెద్దఎత్తున ధాన్యం ఉండడంతో నర్సాపూర్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం, ఇవ్వగా వారు సకాలంలో వచ్చి పూర్తిగా మంటలు ఆర్పివేశారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని గ్రామస్తులు వాపోయారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ నాగవర్ధన్, ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ పరిశీలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళా కూలీ మృతి


లక్ష్మి మృతదేహం


ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

సిద్దిపేటఅర్బన్: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళా కూలీ మృతి చెందింది. సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం... రాజీవ్ రహదారి మధ్యలో డివైడర్‌పై చెట్ల పాదుల చుట్టూ పెరిగిన గడ్డిని హెచ్‌కేఆర్ సంస్థ కూలీల చేత తొలగింపచేస్తోంది. దుబ్బాక డిపోనకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడంతో సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల శివారు రిలయన్స్ పెట్రోల్ పంపు సమీపంలో పనిచేస్తున్న రాజీవ్ రహదారిపై పనిచేస్తున్న కూలీల మీదకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కొండపాక గ్రామానికి చెందిన వీర బోయిన లక్ష్మి మృతి చెందగా, జప్తినాచారం గ్రామానికి చెందిన మాస్టి బాల్‌లక్ష్మికి గాయాలయ్యాయి. ఈ మేరకు మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ భానుప్రకాష్ తెలిపారు.

అనాథలైన అక్కాచెల్లి

కొండపాక(గజ్వేల్): కొండపాకకు చెందిన వీరబోయిన కనకయ్య కొన్నేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో భార్య లక్ష్మి కుటుంబ పోషణకు వ్యవసాయంతోపాటు కూలిపనులు చేసుకుంటూ ఇద్దరు కూతుళ్లను చదివించింది. పెద్ద కూతురు మౌనిక ఇంటర్. చిన్నకూతురు పూజ ఇటీవలె 10వ తరగతి పాసైంది. హెచ్‌కేఆర్ సంస్థలో కూలీగా పనిచేస్తూ లక్ష్మి మృతి చెందింది. దీంతో ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల నాయకుడు దొమ్మాట మహిపాల్‌రెడ్డిలు సంఘటనా స్థలానికి వెళ్లి కుటుంబీకులను ఓదార్చారు. అనంతరం చిట్టి దేవేందర్‌రెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

రాంగ్‌రూట్‌లో వెళ్లి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు కథనం ప్రకారం... తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరనగర్‌కాలనీలో నివాసముండే నవీన్‌కుమార్(30) ర్యాపిడో బైక్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి 11.30గంటలకు బైక్‌పై బయలుదేరి వెళ్లాడు. శుక్రవారం తెల్లావారుజామున 4.40గంటల సమయంలో అశోక్‌నగర్ నర్సరీ సమీపంలో యూటర్న్ వద్ద నవీన్‌కుమార్ రాంగ్‌రూట్‌లో వెళ్లి డీసీఎంను ఢీ కొట్టాడు. దీంతో నవీన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి ..

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. భానూర్– బీడీఎల్ ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం... వికారాబాద్ జిల్లాకు చెందిన లక్ష్మప్ప(38) పటాన్‌చెరు మండల పరిధిలోని నందిగామ గ్రామ పరిధిలో ఉన్న కాలేజీకి సంబంధించిన ఎంట్రెన్స్ ఫ్లాగ్స్ కడుతున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

నీటిగుంతలో పడి బీజేపీనేత..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): నీటి గుంతలో పడి బీజేపీ నేత మృతి చెందాడు. సదాశివపేట సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు దిలీప్(50)వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న నీటి గుంతలో తన దుస్తులు శుభ్రం చేసుకున్నాడు. అనంతరం స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తుగా నీటి గుంతలో పడిపోయాడు. సమయానికి ఎవరు లేకపోవడంతో నీటి గుంతలో మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు సీఐ తెలిపారు.

హైబీపీతో వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: హైబీపీ, షుగర్‌తో బాధపడుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. భానుర్– బీడీఎల్ ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మహేంద్ర(36) బతుకుదెరువు కోసం వచ్చి రామచంద్రాపురం పరిధిలోని వెలమల లో ఉంటూ కూలిపనిచేస్తున్నాడు. పది సంవత్సరాల నుంచి హైబీపీ, షుగర్ ఎక్కువ కావడంతో ఇబ్బందులు పడుతూ, మాత్రలు వాడుతున్నాడు. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం తలనొప్పి వస్తుందని చెప్పి వెలమలలో ఆర్ఎంపీ వద్ద చూపించుకొని ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో మహేంద్ర తల తిరుగుతుందని చెప్పి కింద పడిపోయాడు. స్థానికుల సహకారంతో భార్య రోష్మి చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా, ఈసీజీ తీసి పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్టు వెల్లడించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు


బోల్తా పడిన ట్రాక్టర్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పిల్లుట్ల పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌తో శుక్రవారం హరితహారంలో నాటిన మొక్కలకు నీరు పోస్తున్న క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో పంచాయతీ డ్రైవర్ నర్సింలు గాయపడ్డాడు. సర్పంచ్ రవి చికిత్స నిమిత్తం శివ్వంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పలువురిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): భూతగాదాల్లో పలువురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు. మండల పరిధి సికింద్లాపూర్ గ్రామ పరిధిలో చోటు చేసుకున్న భూతగాదాల్లో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. గంగుల నాగార్జున ఫిర్యాదు మేరకు కాయతి సాయిరెడ్డితోపాటు కరుణాకర్‌రెడ్డి, విమలపై కేసు నమోదు కాగా, సాయిరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్ తరలించగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

యథేచ్ఛగా మట్టి దందా

- చెరువులు, కుంటల్లో తవ్వకాలు
- రాత్రిళ్లు ఇటుక బట్టీలకు తరలింపు


తోటపల్లి చెరువులో ట్రాక్టర్లలో మట్టి పోస్తున్న ఉపాధిహామీ కూలీలు

హుస్నాబాద్‌రూరల్: చెట్లు కూల్చి, చెరువులను చెరబడుతూ అక్రమార్కులు జోరుగా మట్టి దందా సాగిస్తున్నారు. చెరువులు, కుంటల్లో సారవంతమైన మట్టిని కొందరు అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉపాధిహామీ పనుల స్థలం నుంచి మట్టిని ట్రాక్టర్ల ద్వారా రైతుల పొలాలకు అని చెప్పి రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా వ్యాపార అవసరాలకు తరలిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. ఒక్కో ట్రిప్పు మట్టి రూ.1,100లకు అమ్ముకుంటున్నట్టు సమాచారం.

శివారులో ప్రాంతాల్లో అధికం..

- హుస్నాబాద్ పట్టణ శివారు గ్రామాలైన పందిల్ల, తోటపల్లి, పోతారం(ఎస్), నాగారం, పొట్లపల్లి చెరువులు.. కుంటలు లక్ష్యంగా మట్టి దందా కొనసాగుతోంది.
- పట్టణ శివారులో ఇటుక బట్టీలకు అవసరమైన ఒండ్రు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు.
- మట్టి రవాణాలో లాభాలు అధికంగా వస్తుండడంతో కొంతమంది సొంతంగా ట్రాక్టర్లు కొనుగోలు చేసి దందా కొనసాగిస్తున్నారు.
- జాతీయ ఉపాధిహామీ పథకంలో చెరువుల్లో తవ్విన మట్టిని స్థానికంగా ఉండే రైతులు పొలాలకు తరలించాలని నిబంధనలున్నా.. అవేవి పట్టించుకోవడం లేదు.
- ట్రాక్టర్ల ద్వారా రహస్యం ప్రదేశాల్లో డంపు చేసి, రాత్రి సమయాల్లో ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు.


చెరువులో జేసీబీలతో చెట్లను కూల్చి మట్టిని తవ్విన దృశ్యం

అధికారులు అడ్డుకోవాలి

చెరువులు, కుంటల మట్టిని అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. రాత్రిళ్లు ట్రాక్టర్ల ద్వారా మట్టి దందా చేస్తున్న వారిపై రెవెన్యూ అధికారులు నిఘా పెట్టాలి. మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలి.

– గుగులోతు భాస్కర్‌నాయక్, గిరిజన నాయకుడు

చర్యలు తప్పవు

రైతుల పొలాలకు మట్టి కొడుతున్నామంటే వదిలేశాం. ఇటుక బట్టీలకు కొడుతున్నారంటే చర్యలు తీసుకుంటాం. చెరువు మట్టిని ఎట్టి పరిస్థితిలో ఇటుక బట్టీలకు తరలించడం తప్పు దీనిపై వెరు సమాచారం ఇచ్చినా, జేసీబీలు, ట్రాక్టర్లు సీజ్ చేసి కేసులు పెడతాం. పెట్టి సీజ్ చేస్తాం.

– గయాస్ ఉన్నీసాబేగం, హుస్నాబాద్ తహసీల్దార్

పొలాలకు మాత్రమే తరలించాలి

ఉపాధిహామీలో భాగంగా తోటపల్లి చెరువులో మట్టి తవ్వకం పనులు జరుగుతున్నాయి. రైతులు పొలాల కోసం కావాలని అడిగితే అనుమతి ఇచ్చాం. కొంతమంది అక్రమంగా మట్టిని డంపు చేసి ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని తెలిసింది. డంపులను గుర్తించి మట్టిని పంట పొలాలకు తరలిస్తాం.

– పద్మ, ఏపీఓ, హుస్నాబాద్